ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 35
సంచిక : 35
పేజీలు : 3
శుక్రవారం, సెప్టెంబర్ 12, 2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



## మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపన

**- అవగాహనా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**టీ మీడియా,సెప్టెంబర్11,పాల్వంచ:** యువత,విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యసాధనకై కృషి చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ అన్నారు. పాల్వంచ నవభారత్ఇంజినీరింగ్ కళాశాల నందు ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ తెలిపారు.విద్యార్థుల దృష్టి తమ భవిష్యత్తు,జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలని,నిషేధిత గంజాయి,డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు,యువత ఆకర్షితులు కావద్దని జిల్లా అన్నారు.గంజాయి,డ్రగ్స్ అలవాటు వలన శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని పాడుచేస్తుందని కావున చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.మాదక ద్రవ్యాల నిర్మూలన గంజాయి రహిత జిల్లానే లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం పోలీసు శాఖ కృషి చేస్తోందని అందులో బాగంగా విద్యాసంస్థలు,గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు.మత్తుకు బానిస అవడానికి అనేక కారణాలు ఉంటాయి పరిసరాల ప్రభావం,చెడు స్నేహితులు,సన్నిహితుల వలన చెడు మార్గాల వైపు వెళ్ళవద్దని సూచించారు.గంజాయి,డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేయడంతో పాటు భవిష్యత్ లేకుండా చేస్తుందనే విషయాన్ని విద్యార్థులు, యువత గ్రహించి అలాంటి చెడు అలవాట్లకు ఆకర్షితులవ్వద్దని విజ్ఞప్తి చేశారు.మత్తు పదార్థాలను అరికట్టేందుకు యువత,విద్యార్థులు అంతా యాంటీ డ్రగ్స్ కమిటీలలో సభ్యులుగా చేరి యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా సహకరించాలని తెలిపారు. డ్రగ్స్ నివారణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. యువత యొక్క ప్రవర్తనను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనిస్తూ వారు ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా గమనిస్తూ ఉండాలని సూచించారు. మీ మీ ప్రాంతాలలో ఎక్కడైనా గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబధిత సమాచారాన్ని స్థానిక పోలీసులకు ఇవ్వాలని కోరారు.యువతను లక్ష్యంగా చేసుకొని గంజాయి,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో సుమారుగా 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.అదే విధంగా విద్యార్థులు ఎవరైనా ర్యాగింగ్ నకు పాల్పడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ప్రస్తుత కాలంలో సైబర్ నేరగాళు ఎన్నో రకాలుగా అమాయకుల ఖాతాల్లో నుండి నగదును కాజేస్తున్నారని,ఎప్పటికప్పుడు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగియుండి తమ చుట్టుప్రక్కల వారికి కూడా అవగాహనా కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియా వినియోగించేటప్పుడు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన్ రావు మరియు పాల్వంచ ఎస్సై సుమన్,కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మూతపడుతున్న
# మహిళా శక్తి క్యాంటీన్లు

**-కలెక్టర్ పర్యటనంటేనే... తెరుస్తున్న నిర్వాహకులు**



**టి మీడియా, సెప్టెంబర్ 11,భద్రాద్రికొత్తగూడెం :** రాష్ట్రంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభించి ప్రతీ మహిళను కోటీశ్వరురాలును చేస్తా.. ప్రతీ మహిళకు రుణసదుపాయం కల్పిస్తా.. . క్షేత్రస్థాయిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలో సుమారు రూ.20 లక్షల వ్యయంతో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి జిల్లా ప్రభుత్వ దవాఖాన వెంట స్ట్రీట్ వెండర్ జోన్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్. స్ట్రీట్ వెండర్ జోన్‌మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వ్యాపార నిర్వహణకు కేటాయిస్తూ ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు (ఫుడ్ కోర్టు)గా నామకరణం చేసింది. ఈ ఫుడ్ కోర్టును రాష్ట్ర మంత్రులు ఘనంగా ప్రారంభించి మహిళలను తమ కాళ్లమీద నిలబడేలా చేశామని గొప్పలు చెప్పుకున్నారు.

**తూతూ మంత్రంగా ఫుడ్ కోర్టుల నిర్వహణ**

సుమారు రూ.20 లక్షలతో 20 షాపులు నిర్మించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకే ఈ ఫుడ్ కోర్టులను కేటాయించారు. టిఫిన్స్, బ్రెడ్ ఆమ్లెట్, ఫాస్ట్ ఫుడ్, నూడుల్స్, పచ్చళ్ళు, పిండి వంటలు, చికెన్ పకోడి, చపాతి, తదితరాలు ఈ ఫుడ్ కోర్టులో మహిళా సభ్యులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం కనీసం రుణసదుపాయం చేయకపోయినా బయట నుంచి అప్పులు తీసుకువచ్చి మహిళా సభ్యులు వ్యాపార కార్యాకలాపాలు సాగించారు. కానీ అనుకున్నంతగా ఇక్కడ వ్యాపారాలు సాగక అనేక మంది నష్టపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రూ.500లు కూడా గిరాకీ కావడం లేదని మహిళా సభ్యులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో చేసేదేమీలేక, తీసుకువచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక.. అలాగని నష్టాలకు వ్యాపారాన్ని నిర్వహించలేక ఇబ్బందులుపడుతున్నారు. మొత్తం 20 షాపుల్లో కేవలం ఆరు షాపుల్లోనే టిఫిన్ సెంటర్, కర్రీ పాయింట్‌ను నిర్వహిస్తున్నారు.

**కలెక్టర్ పర్యటనంటేనే తెరుస్తున్న నిర్వాహకులు**

జిల్లా కలెక్టర్ ఇటీవల ఫుడ్ కోర్టులో మేకపాలను ప్రారంభించేందుకు వచ్చారు. ఆ రోజే షాపులన్నీ కళకళలాడాయి. వ్యాపారం ఏ విధంగా నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకొని తగిన సలహాలు, సూచనలు చేశారు. ప్రజా ప్రతినిధులు, ఇతర

మిగతా 3లో

## అటవీ సంపదను బాధ్యతగా కాపాడుకోవాలి..




**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**టి మీడియా, సెప్టెంబర్ 11, ఖమ్మం:** అడవుల సంరక్షణ అటవీ అమర వీరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.ఖమ్మం జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం నందు అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అటవీ సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, డి.ఎఫ్.ఓ. సిద్ధార్థ్ విక్రమ్ సింగ్లతోకలిసిపాల్గొన్నారు.అటవీ అమరవీరుల స్థూపం వద్ద జిల్లా కలెక్టర్ పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు.అమరవీరుల సంస్మరణార్థం రెండు నిమిషాల మౌనం పాటించి, అటవీ%-% వన్యప్రాణి రక్షణ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 2022లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా ఉన్న సమయంలో శ్రీనివాస్ రావు అనే అటవీ అధికారి అకాల మరణం చెందారని, వారి మరణం తనను చాలా కలిచి వేసిందని అన్నారు. కొత్తగూడెం జిల్లాలో వివిధ హెూదాలలో పనిచేసే సమయంలో అటవీ పరిరక్షణ మీద అనేక సమస్యలు పరిశీలించానని అన్నారు. అడవుల సంరక్షణకు నిర్విరామంగా కృషి చేస్తున్న అటవీశాఖ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అటవీ శాఖ సిబ్బందిని కలెక్టర్ సైలెంట్ హీరోస్ గా



అభివర్ణించారు. అటవీ పరిరక్షణ కోసం వీరోచితంగా రాత్రి, పగలు అటవీశాఖ సిబ్బంది పనిచేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.అడవులు నరుక్కుంటూ పోతే మన మనుగడ కష్టం అవుతుందని, మానవ జీవన విధానంలో చెట్లు చాలా కీలకమని అన్నారు. ఖమ్మం జిల్లా అడవులకు, వన్య ప్రాణులకు నిలయంగా ఉందని, జిల్లాలోని వన సంపద కాపాడే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.పర్యావరణాన్ని కాపాడుతూ ఎకో టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని

మిగతా 3లో



## యూరియా సకాలంలో అందించాలి

2లో...



## కాంగ్రెస్ పార్టీలో 80 కుటుంబాలు చేరిక

**టి మీడియా, సెప్టెంబర్ 11, పినపాక ప్రతినిధి:** పినపాక మండలం దుగినేపల్లి గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై, భారత రాష్ట్ర సమితి పార్టీ నుండి 80 కుటుంబాలు మాజీ ఏఎంసీ డైరెక్టర్ బిల్లం సాంబశివరావు , కేత ప్రసాద్ , పూనెం జగన్ ఆధ్వర్యంలో గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దొరపాలనలో పది సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా అతలాకుతలమైందని, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, పేదవాడికి ఎటువంటి ప్రయోజనాలు కలగకుండా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ రానున్న రోజులలో అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పేరం వెంకటేశ్వర్లు , దాట్ల రాజేష్ , కొర్స బాలకృష్ణ , సాగర్ రెడ్డి , మధుసూదన్ రెడ్డి , సుంకరి రమణ , కంది సుబ్బారెడ్డి , ఉడుముల లక్ష్మారెడ్డి , గంగిరెడ్డి వెంకటరెడ్డి , కోడం రామ్మోహన్ , ఆరే నవీన్ పాల్గొన్నారు.



## రోడ్డు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

**టి మీడియా, సెప్టెంబర్ 11,పినపాక ప్రతినిధి:**అశ్వాపురం మండలంలోని రాంనగర్ నుండి బట్టీలగుంపు వరకు కోటి యాబై లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బీటి రోడ్డు మంజూరు చేసిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు రెండు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటుచేసిన సమావేశంలో బట్టీలగుంపు మాజీ సర్పంచ్ బట్ట సత్యనారాయణ మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోలేదన్నారు. గతంలో మిట్టగూడెం నుండి కుమ్మరిగూడెం వరకు బీటీ రోడ్డుకు సుమారు 6 కోట్ల రూపాయలు మంజూరి చేసిన ఘనత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకే దక్కుతుందన్నారు. రాంనగర్ నుండి రాయిగూడెం (మణుగూరు) వరకు మెటల్ రోడ్డు కూడా పాయం వెంకటేశ్వర్లు కృషితోనే జరిగిన విషయం గుర్తుచేశారు. కుమ్మరిగూడెం, బట్టీలగుంపు, రాంనగర్, జానకిరామయ్య గుంపు, పాములపల్లి,కాకర్ల సుందరయ్య గుంపు, కొత్తగుంపు ప్రజలకు మణుగూరు రాకపోకలకు సౌకర్యంగా ఉండే, ఈ మెటల్ రోడ్డుకి కూడా నిధులు కేటాయించి బీటీ రోడ్డు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కొమరం భాస్కరరావు, కలివేటి సాంబశివరావు, కనితి కృష్ణవేణి, కలివేటి సమ్మక్క, కోరం దేవమ్మ, కలివేటి వెంకటేశ్వర్లు ఇరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**టీ మీడియా,సెప్టెంబర్11,సింగరేణి(కారేపల్లి):**మండలంలో వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ గురువారం విస్తృతంగా పర్యటించారు. కొత్తూరు తండా గ్రామానికి చెందిన మాజీ వార్డు మాలోత్ సఖ్య తల్లి మాలోత్ కోమటి దశదిన కర్మకు హాజరై వారి చిత్ర పటానికి పూల మాలవేసి నివాలర్పిం చారు. మొట్లగూడెం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ గడిపర్తి శ్రీను ఇటీవల మరణించడంతో వారి చిత్ర పటానికి పూల మాల వేసి నివాలులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాజుమల్లాయిగూడెం గ్రామానికి చెందిన నున్నా కాంతయ్య అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. చీమలపాడు గ్రామానికి చెందిన కట్టెకోల రాంబాయి దశదిన కర్మకు హాజరై వారి పటానికి పూలతో నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ మాలోత్ శకుంతల, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ వైస్ చైర్మన్ ధరవత్ మంగిలాల్, మాజీ సర్పంచ్ లు మాలోత్ కిషోర్, బానోత్ శంకర్, నాయకులు అజ్మీర వీరన్న, ఆజ్మీరా బిక్కు లాల్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాంకుడొత్ నరేష్, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ పొలాగాని శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి నరేంద్ర, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా సకాలంలో అందించాలి

**-పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలి**

**తెలంగాణ రైతు సంఘం ప్రదర్శన ,ధర్నా**

**టీ మీడియా ,సెప్టెంబర్ 11 ,కామేపల్లి :** సాగు భూములు ఉన్న రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలి అని, యూరియా సకాలంలో అందించాలి అని,పాస్ పుస్తకాలు లేని రైతులకు కుడా యూరియా సరఫరా చేయాలని, పత్తి దిగుమతి సుంకం కొనసాగించాలి అని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం కామేపల్లి మండల కేంద్రంలో రైతులు ప్రదర్శన నిర్వహించారు అనంతరం తహాశీల్దార్ కార్యాలయం మరియు వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ మాట్లాడుతూ కామేపల్లి మండలం లో 100 సంవత్సరాల నుంచి మూడు, నాలుగు తరాల నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు అని మండలం లో పోరంబోకు భూములు, ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూములు సాగు దారులకు పట్టాదారు పాస్ పుస్తకాలు భూ భారతి చట్టం లో భాగంగా మంజూరు చేయాలని కోరారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను పరిశీలించి జాబితా నుంచి తొలగించాలని, సాదాబై నామ్ ప్రకారం ప్రస్తుత సాగుదారులకు పడ్డదారుపాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి యూరియా సకాలంలో దిగుమతి చేసుకోకపోవడం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ తో పాటు వర్షాలు ఉన్న పరిశ్రమను ఉత్పత్తి నిలిపివేయడంతో యూరియా కొరత ఏర్పడిందని రైతులకు అవసరమైన యూరియా సకాలంలో అందించాలని కోరారు అనేక ప్రాంతాల్లో పట్టాదారు పాస్ పుస్తకాలు లేవనే పేరుతో రైతులకు యూరియా సరఫరా చేయటం లేదని ప్రభుత్వ రికార్డులలో నమోదు కాని రైతులకు ఆధార్ కార్డు ఆధారంగా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు భారతదేశంలో పత్తి దిగుబడులు వచ్చి మార్కెట్లో విక్రయించే సమయంలో విదేశీ పత్తి దిగుమతి పై ఉన్న 11% సుంకం ఎత్తివేసి అమెరికా నుంచి 40 లక్షల వేళ పత్తి దిగుమతి చేయటం వలన బహిరంగ మార్కెట్లో పత్తి ధరలు పడిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఉందని విదేశీ దిగుమతి సుంకం పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు డిప్యూటీ తహాశీల్దార్ కి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, జిల్లా సినీయర్ నాయకులు ఇంజం నాగభూషణం, సిఐటియు జిల్లా నాయకులు బాదావత్ శ్రీనివాసరావు,కామేపల్లి మండల రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు రాయల సత్యనారాయణ, సకినాల శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు అంజయ్య,కొల్లిపాక రామకృష్ణ, వీరభద్రం, ఉసేన్, అనంతరాములు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలు

**-పురిమళ్ల సునందకు కీర్తి పురస్కారం**



**టి మీడియా, సెప్టెంబర్ 11, ఖమ్మం:** ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, ఉత్తమ ఉపాధ్యాయురాలు పురిమళ్ల సునందకు 2024 సంవత్సరానికి గాను తెలుగు యూనివర్శిటీ కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేస్తున్న వారికి ఈ పురస్కారాన్ని అందచేస్తారు. పురిమళ్ల సునంద ఉపాధ్యాయురాలిగా పని చేస్తూనే సాహిత్యంలో రాణిస్తున్నారు. కవయిత్రిగా, రచయిత్రిగా, బాలసాహితీవేత్తగా విశేష కృషిగావిస్తున్నారు. తను పని చేసే ప్రతి పాఠశాలలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తూ సాహిత్యంలో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రతి ఏటా తన సోదరి పురిమళ్ల పద్మజ పేరుతో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందచేస్తున్నారు. పురిమళ్ల ఫౌండేషన్‌ను 2019లో స్థాపించి లబ్ధప్రతిష్టులైన సాహితీవేత్తలకు భోగోజు సముద్రమ్మ-పురుషోత్తం స్మారక నగదు పురస్కారాన్ని అందచేస్తున్నారు. ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై ఇటీవలనే భద్రాద్రి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఇటు ఉపాధ్యాయ రంగంలోనూ, అటు సాహిత్య రంగంలోనూ విశేష కృషి గావిస్తున్న పురిమళ్ల సునందకు తెలుగు పురస్కారం లభించింది. ఈ మేరకు తెలుగు యూనివర్శిటీ ప్రకటించింది. ఈ నెల 23, 24 తేదీల్లో జరిగే ఉత్సవంలో పురస్కారాన్ని సునంద అందుకోనున్నారు. జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు, కవులు, రచయితలు సునందకు శభాకాంక్షలు తెలిపారు.



## సబ్ సెంటర్లలో అన్ని రకాల పరీక్షలు : జ్యోతిలక్ష్మి

**టీ మీడియా,సెప్టెంబర్11,సింగరేణి(కారేపల్లి)::** ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో (హెల్త్ సబ్ సెంటర్లు) అన్ని రకాల జ్వర పరీక్షలు చేసేందుకు పరికరాలు అందుబాటులో ఉన్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ బంధం జ్యోతిలక్ష్మి తెలిపారు. ఖమ్మం జిల్లా సింగరేణి (కారేపల్లి) మండల పరిధిలోని చీమలపాడు సబ్ సెంటర్‌ను గురువారం ఆమె సందర్శించారు. స్థానిక వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి సబ్ సెంటర్‌లో డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి జ్వర పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.రెండు మూడు రోజుల కంటే ఎక్కువ రోజులు జ్వరం ఉంటే రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేయాలని, అవసరమైతే ఖమ్మం ప్రధాన ఆస్పత్రి ల్యాబ్‌కు పంపించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ, స్థానిక ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. గర్భిణీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు సబ్ సెంటర్‌లోని పలు రికార్డులను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఎల్ హెచ్ పి కళ్యాణి, ఏఎన్ఎంలు ముక్తి నాగమణి, ఉష పాల్గొన్నారు.

# చరిత్రను వక్రీకరిస్తే జాతి క్షమించదు

**-తెలంగాణ సాయుధ రైతాంగ**

**పోరాటం మహోత్తర ఘట్టం**

**- వారోత్సవాలను ప్రారంభించిన బాగం**

**టీ మీడియా,సెప్టెంబర్11,ఖమ్మం :**

చరిత్రను వక్రీకరిస్తే తెలంగాణ జాతి క్షమించదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. తెలంగాణ పోరాటాన్ని మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, తెలంగాణ పోరాటంలో బిజెపికి ఎటువంటి పాత్ర లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ప్రారంభ సందర్భంగా గురువారం పాత బస్టాండ్ సమీపంలోని సాయుధ పోరాటయోధుడు, సిపిఐ అగ్ర నాయకులు నల్లమల గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాలలు -వేసి వార్షికోత్సవాలను హేమంతరావు ప్రారంభించారు. పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి -ఆవిష్కరించారు. యర్రాబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత -నిజాం స్వాతంత్ర రాజుగా ప్రకటించుకున్న తర్వాత రావి నారాయణరెడ్డి, ముగ్దుం మోహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. నిజాం రక్కసి పాలనకు వ్యతిరేకంగా సాగిన మహోత్తర పోరాటంలో సామాన్యులు సాయుధులై పోరాడారని హేమంతరావు తెలిపారు. నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు అమరులయ్యారన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన ఈ పోరాటంలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారని సాయుధ పోరుకు పిలుపు నిచ్చిన వారిలో మగ్ధుం -మోహినుద్దీన్ కూడా ఉన్నారని హేమంతరావు తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటం లేకుంటే భారతదేశపు నడిబొడ్డున తెలంగాణ మరో కాశ్మీర్ -రగులుతూనే ఉండేదన్నారు. తెలంగాణకు సంబంధించి సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలన్న విషయంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒకే -వైఖరితో ఉండటం దురదృష్టకరమన్నారు. నాటి సాయుధ పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేందుకు వారోత్సవాలను -నిర్వహిస్తున్నట్లు హేమంతరావు



తెలిపారు. దేశంలో నెలకొన్న ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలను తెలంగాణ పోరాట స్ఫూర్తితో కొనసాగిస్తామన్నారు. కార్యక్రమానికి ముందు అంబేడ్కర్ సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, నగర కార్యదర్శి ఎస్కే జానిమియా, కొండపర్తి గోవిందరావు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి -శివరామకృష్ణ. తోట రామాంజనేయులు, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా సమితి -సభ్యులు వరదా నర్సింహారావు, తాటి నిర్మల, బోడా వీరన్న, ఎస్ కె సైదా, మోహన్రావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.



## ఎర్రబ్యాడ్జీలు  తో విధులకు ఆర్టీసీ ఉద్యోగులు

**-భద్రాచలం డిపోలో ఆందోళనను పరిష్కరించండి**

**-యాజమాన్యానికి రీజనల్ జేఏసీ డిమాండ్**

**టి మీడియా, సెప్టెంబర్ 11, ఖమ్మం** :భద్రాచలం డిపో కార్మికుల ఆందోళన,సమస్యలను వెంటనే పరిష్కరించాలని,తగ్గించిన మస్టర్ల ను పునరుద్ధరించాలని,కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ రీజియన్ వ్యాప్త ఆర్టీసీ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటి (జెఎసి) ఆధ్వర్యంలో కార్మికులు అందరూ "ఎర్రబ్యాడ్జీలు" ధరించి విధులకు హాజరయ్యారు. గురువారం ఉదయం మొదటి షిఫ్టు నుండి రీజియన్ లోనిఖమ్మం,కొత్తగూడెం,మధిర,సత్తుపల్లి,భద్రాచలం,మణుగూరు, ఇల్లెందు డిపోలలో భద్రాచలం డిపో డ్రైవర్ ఉద్యోగుల ఆందోళన పరిష్కరించాలంటూ వారికి సంఘీభావంగా ఆందోళనలో పాల్గొన్నారు.రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోలలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర, రీజియన్,డిపో కమిటీల నాయకులు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఖమ్మం డిపోలో జరిగిన ఆందోళనలో జెఎసి నాయకులు పిట్టల సుధాకర్ బూదాటి శ్రీనివాసరెడ్డి నిమ్మటూరి సత్యం,బత్తినేని హనుమంతరావు,పగిళ్లపల్లి నరసింహారావు,గుగ్గిళ్ల రోశయ్య, బేతంపూడి బుచ్చిబాబు,నరసింహ చారి,పద్మా,జ్యోతి,సంధ్యారాణి,



## సెంట్రల్ మెడికల్ స్టోర్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**- ఔషధాలు అందుబాటులో ఉండేలా చర్యలు**

**టీ మీడియా,సెప్టెంబర్11,రామవరం :**
మాత శిశు ఆరోగ్య కేంద్రంలోని సెంట్రల్ మెడికల్ స్టోర్ ను గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మికంగా సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టోర్‌లో నిల్వ ఉంచిన ఔషధాల లభ్యత, నాణ్యత, గడువు తేది, ఆసుపత్రులకు సరఫరా ప్రక్రియలను పరిశీలించారు. రోగులకు అవసరమయ్యే ఔషధాలు ఎల్లప్పుడూ సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, గడువు ముగిసిన మందులను తక్షణమే తొలగించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు.తనిఖీ సందర్భంగా సెంట్రల్ మెడికల్ స్టోర్ సిబ్బంది కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. ప్రధాన రహదారి నుండి స్టోర్‌కు వచ్చే రహదారి మరమ్మత్తులు చేయాలని, స్టోర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మందుల నిల్వ రాకులు, బరువైన బాక్సులు ఎత్తడానికి అవసరమైన యంత్రాలను సమకూర్చాలని కోరగా స్పందించిన కలెక్టర్ అవసరమైన అన్ని సదుపాయాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.స్టోర్‌లోని ఒక హాల్ ఫ్లోరింగ్ పనులు పెండింగ్లో ఉన్న విషయాన్ని ఆయన గమనించారు. ఈ పనులను పూర్తిచేయడానికి అవసరమైన వ్యయంపై తక్షణమే నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించి, ఫ్లోరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి వాడుకలోకి తేవాలని సూచించారు.కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం దృష్ట్యా మెడికల్ స్టోర్ల సమర్థవంతమైన నిర్వహణ అత్యంత కీలకమని, అవసరమైన సదుపాయాల కల్పనలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. మందులు కొరత రాకుండా సంబంధిత అధికారులు అవసరమైన ఇండెంట్లు సకాలంలో పంపించాలి, ప్రతి రోగికి అవసరమైన ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రతి అధికారికి, సిబ్బందికి ప్రజా ఆరోగ్యం అత్యున్నత ప్రాధాన్యతగా ఉండాలని, వైద్య రంగంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సీనియర్ ఫార్మసీ అధికారి శారద, ఫార్మసిస్ట్ అధికారి రామచందర్, సెంట్రల్ మెడికల్ స్టోర్స్ సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి..

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**-అంగన్వాడీ కేంద్రాల్లో మౌళిక వసతుల కల్పన**

**టీ మీడియా,సెప్టెంబర్11,ఖమ్మం:** జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇరిగేషన్, పంచాయతీ రాజ్ , ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, ట్రైబల్ వెల్ఫేర్, మున్సిపాలిటీ, వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కావడం చాలా కీలకమని, పనులు ఆలస్యం కావడం వల్ల నిర్మాణ ఖర్చులు పెరిగి ప్రభుత్వంపై భారం పడుతుందని కలెక్టర్ తెలిపారు. అభివృద్ధి పనులపై క్షేత్ర స్థాయిలో చిన్న, చిన్న సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని అన్నారు. జిల్లాకు మంజూరైన 41 అంగన్వాడీ కేంద్రాల్లో 40, 101 గ్రామ పంచాయతీ భవనాల్లో 70 నిర్మాణంలో ఉన్నాయని, 30 జిపి బిల్డింగ్స్, 1 అంగన్వాడీ కేంద్రం నిర్మాణం పూర్తయిందని, పెండింగ్ పనులు వేగవంతం చేస్తూ డిసెంబర్ చివరి నాటికి జిపి బిల్డింగ్స్, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 11 కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ లలో 5 పూర్తి చేశామని, 4 నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని, ఫైల్ క్లియర్ చేసి త్వరగా టెండర్లు పిలవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మేర టాయిలెట్స్ నిర్మాణ పనులు ఉపాధి హామీ క్రింద ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రస్తుతం సొంత భవనాలలో ఉన్న 940 అంగన్వాడి కేంద్రాలలో త్రాగు నీటి సరఫరా, టాయిలెట్ బ్లాక్స్ మొదలగు మౌళిక వసతుల కల్పన పనులు ఈ.జి.ఎస్. ద్వారా సాచురేషన్ పద్ధతిలో పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.రఘునాథపాలెం మండలంలో మంజూరైన చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూట్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, అక్కడ విద్యుత్ స్తంభాలు, లైన్స్ తరలింపు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి, మధిర, పాలేరు మొదలగు ప్రాంతాలలో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలు పరిశీలించి ప్రతిపాదనలు అందించాలని అన్నారు.ఖమ్మం నగరం పరిధిలో ఆర్ అండ్ బీ రోడ్ల నిర్వహణ, మరమ్మత్తు పనులు కార్పోరేషన్ చేపట్టాలని అన్నారు. ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో చాలా కాలం నుంచి పనులు గ్రౌండ్ కాకుండా ఉన్న వాటిని రద్దు చేయాలని అన్నారు. ఆర్ అండ్ బి శాఖ పెండింగ్ పనులపై కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ అభివృద్ధి పనులపై అసిస్టెంట్ ఇంజనీర్లతో రెగ్యులర్ గా సమీక్ష నిర్వహించాలని, పనులు వేగవంతంగా జరిగితే సంబంధిత మంత్రులను సంప్రదించి బిల్లుల చెల్లింపులు పూర్తి అయ్యేలా కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. 50 సబ్ సెంటర్ పనుల్లో 38 పూర్తి చేశామని, వచ్చే నెల రోజుల వ్యవధిలో పెండింగ్ 12 సబ్ సెంటర్ పనులు పూర్తి చేసి వైద్య శాఖకు



అప్పగించాలని అన్నారు. సిడిపి, ఎస్.డి.ఎఫ్, ఎంపి ల్యాడ్స్ క్రింద గతంలో మంజూరు చేసి గ్రౌండ్ కాని పనులను రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 80 శాతం పూర్తయిన అభివృద్ధి పనులపై దృష్టి పెట్టి త్వరగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని అన్నారు. అభివృద్ధి పనుల బిల్లులు సమర్పించే సమయంలో ఇసుక చలాన్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. టేకులపల్లి డైట్ కాలేజీ నిర్మాణ పనులు 70 శాతం పూర్తయ్యాయని, వీటికి అవసరమైన సవరణ అంచనా ఆమోదింపచేసుకొని మార్చి 2026 నాటికి పనులు పూర్తి కావాలని అన్నారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించి అక్టోబర్ తర్వాత చెక్ డ్యాం పనులు ప్రారంభించాలని అన్నారు. రఘునాథ పాలెం మండలంలో చేపట్టిన ఎస్టి హాస్టల్ 90 శాతం పూర్తయిందని, వీటి పెండింగ్ పనులు పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఓ ఏ. శ్రీనివాస్, డిఆర్డీవో సన్యాసయ్య, డిడబ్ల్యూఓ రాంగోపాల్ రెడ్డి, ఎస్ఇ లు యాకోబు, వెంకట్ రెడ్డి, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి., ఇరిగేషన్, మునిసిపల్, మిషన్ భగీరథ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ సిబ్బంది సాహసం

**10 అడుగుల లోతు నీటిలో ఈదుకుంటూ వెళ్లి లైన్ మరమ్మతులు**

**అభినందించిన విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు**

**టీ మీడియా,సెప్టెంబర్11, చంద్రుగొండ**
అసలే ప్రమాదకర వృత్తి, ఆపై సాహసాలు, మండల ప్రజలను, ఆ శాఖ ఉన్నత అధికారులను ఆశ్చర్యంలో ముంచేసింది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి వృత్తి ధర్మాన్ని నిర్వర్తించిన విద్యుత్ శాఖ సిబ్బందిపై ప్రశంసల జల్లు కురుస్తుంది. ఇక వివరాల్లోకెళితే.. మండల పరిధిలోని మద్దుకూరు ప్రాజెక్టు(కొత్త చెరువు) ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిండుకుండలా మారింది. అయితే ప్రాజెక్టు మధ్యలో నుండి కరెంట్ మెయిన్ లైన్ ఉండగా.. సరిగ్గా 10 అడుగుల లోతులో ఉన్న కరెంటు స్తంభం వద్ద లైన్ మరమ్మతులకు గురవడంతో సమస్యను పసిగట్టిన విద్యుత్ అధికారులు, సిబ్బంది విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని అధిగమించేందుకు సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. నీటిలో ఈదుకుంటూ వెళ్లి సమస్యను పరిష్కరించారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు సిబ్బంది సాహసాన్ని అభినందిస్తూ క్లిష్ట పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు పాటించేలా ఉన్నత అధికారులు చొరవ చూపాలని సూచించారు. రిస్క్ తో కూడిన సమస్యను పరిష్కరించిన సబ్ ఇంజనీర్ నితిన్ రెడ్డి, లైన్మెన్ సతీష్, లైన్ ఇన్‌స్పెక్టర్ తులసీరామ్, అసిస్టెంట్ లైన్మెన్ జీవన్, సహచర సిబ్బంది ప్రసాద్ తన్వీర్ లను జిల్లా ఎస్సి మహేందర్, ఏఈ నరసింహారావులు అభినందించారు.

## ముతపడుతున్న

ఉన్నతాధికారుల పర్యటన అపుడు మాత్రమే ఇవి తెరుచుకున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో ఫుడ్ కోర్టు నిర్వహకుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారయింది. అటు షాపును నిర్వహించలేక, ఇటు మూయలేక ఆర్థికంగా అవస్థలుపడుతూనే ఉన్నారు. ఇక నూడుల్స్, టిఫిన్ సెంటర్ వాళ్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఈ ఫుడ్ కోర్టు నిర్వహకులకు తాగేందుకు నీరు లేక, విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులుపడుతున్నారు. సాయంత్రం వేళ మాత్రమే సౌర విద్యుత్‌ను వినియోగించాలని సంబంధిత అధికారులు ఆదేశించడంతో ఉదయం వేళ నిర్వహిస్తున్న మూడునాలుగు షాపుల నిర్వహకులు కూడా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ ఫుడ్ కోర్టుల నిర్వహణ అంశంపై మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ కే. సుజాతను వివరణ కోరగా ఫుడ్ కోర్టులో కేటాయించిన షాపుల నిర్వహకులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకొని యాధావిధిగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## అటవీ సంపదను

## బాధ్యతగా కాపాడుకోవాలి..

అన్నారు. ఖమ్మం జిల్లాలో అనేక చోట్ల డిజిటల్ డిటాక్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. మన జిల్లా అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రతి రెండు నెలలకు ఒకసారి ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించి అటవీ శాఖకు అవసరమైన సహాయ, సహకారాలు అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ సిబ్బందికి జోహార్లు అర్పిస్తూ అటవీ అమరవీరుల స్ఫూర్తితో అడవుల సంరక్షణకు అధికారులంతా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ అటవీ అమరవీరుల త్యాగం మనందరికీ స్ఫూర్తి అని వారి ఆదర్శాన్ని అనుసరించి మనం ప్రకృతి%-%వన్యప్రాణులను కాపాడుకోవాలని అన్నారు.అటవీ సంరక్షణ ఒక బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యమని తెలిపారు.అనంతరం అటవీ సిబ్బందికి సంరక్షణ పరికరాలు, రెయిన్ కోర్టులు, స్టిక్ గార్డ్స్ లను కలెక్టర్ పంపిణీచేశారు. జిల్లా మ్యానటరింగ్, అటవీ రక్షణలో వినియోగించే కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. సీసీ కెమెరా పనితీరు ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, అటవీ అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.